
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



అల్లూరి సీతారామరాజు

జిల్లా వార్తలు

గురువారం 21 మార్చి 2024

మన్యంలో తేలికపాటి వర్షం

పాడేరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): వాతావరణంలోని మార్పులతో మన్యంలో బుధవారం ముసురు వాతావరణం నెలకొంది. దీంతో అక్కడక్కడ జల్లులతో కూడిన వర్షం కురిసింది. పాడేరు, పరిసర ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు ఆకాశం మేఘావృతమైంది. మధ్యాహ్నం తరువాత ఓ మోస్తరు ఎండకాసింది. సాయంత్రం ఐదు గంటల తరువాత దట్టంగా మబ్బులు కమ్ముకున్నాయి. దీంతో జల్లులతో కూడిన తేలికపాటి వర్షం కురిసింది. రాగల 24 గంటల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

ఉచిత ప్రయాణం ఉత్తిదే!

సొంత డబ్బులతోనే ప్రయాణిస్తున్న టెన్త్ విద్యార్థులు

- పలుచోట్ల హెచ్‌ఎం, వార్డెన్లకు తప్పని చేతి చమురు
- విద్యాశాఖకు వైసీపీ సర్కారు నిధులు విడుదల చేయకపోవడమే కారణం?





పాడేరులోని పరీక్షా కేంద్రాల వద్ద బస్సులు ఎక్కుతున్న టెన్త్ విద్యార్థులు

(ఆంధ్రజ్యోతి-పాడేరు)

పదో తరగతి పరీక్షలు రాసేందుకు ఇతర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులకు ఉచితంగానే పీటీడీ బస్సుల్లో ప్రయాణించే అవకాశం కల్పిస్తున్నామని అధికారులు చెప్పే మాటలు ఉత్తిదేనని తేలిపోయింది. ప్రభుత్వ అధికారుల ప్రకటనలు చూస్తే టెన్త్ విద్యార్థులు పైసా ఖర్చు లేకుండానే పరీక్షా కేంద్రానికి చేరుకోవచ్చునని భావన కలుగుతుంది. కానీ మన్యంలో అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. పొరపాటున ఉచిత ప్రయాణమని బస్సెక్కితే అంతే సంగతులు. టెన్త్ విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించేందుకు వైసీపీ ప్రభుత్వం విద్యాశాఖకు ఎటువంటి నిధులు కేటాయించకపోవడమే దీనికి కారణం.

టెన్త్ హాల్ టికెట్ చూపిస్తే చాలు పీటీడీ బస్సుల్లో టెన్త్ విద్యార్థులకు ఉచిత ప్రయాణమని భావించిన గిరిజన విద్యార్థులు భంగపడ్డారు. అటుగా వెళుతున్న బస్సుల్లో మాత్రమే ఆటువంటి సదుపాయం ఉందని, ఆశ్రమ పాఠశాల నుంచి పరీక్షా కేంద్రానికి వెళ్లేందుకు మాత్రం ప్రత్యేకంగా చార్జీలు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో చేసేది లేక విద్యార్థులే తమ బస్సు చార్జీలను చెల్లిస్తున్నారు. ఇందుకు గాను ప్రతి పాఠశాలలో ఒక టీచర్‌కు బాధ్యతలు అప్పగిస్తుండడంతో, ఆ విద్యార్థుల నుంచి సదరు టీచర్ డబ్బులు వసూలు చేసి పీటీడీ అధికారులకు చెల్లిస్తున్నారు. దీంతో టెన్త్ పరీక్షల సమయంలో తమకు ఈ కండక్టర్ డ్యూటీ ఏమిటని పలువురు టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రం పాడేరులో ఐదు టెన్త్ పరీక్షా కేంద్రాలకు గాను మొత్తం 11 బస్సులను ప్రత్యేకంగా నడుపుతున్నారు. దీంతో దూరాన్ని బట్టి ఒక్కో విద్యార్థి రూ.10 నుంచి రూ.20(ఒక వైపునకు) చొప్పున చార్జీలు చెల్లిస్తున్నారు. పాడేరు మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, రాయిగెడ్డ, శ్రీకృష్ణాపురం, కందమామిడి, గుత్తులపుట్టు, పెదబయలు మండలం తురకలవలస ఆశ్రమ పాఠశాలల నుంచి టెన్త్ బాలికలు పాడేరులోని పరీక్షా కేంద్రాలకు బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారు.

హెచ్‌ఎం, వార్డెన్‌లకు తప్పని చేతి చమురు

పలు ఆశ్రమ పాఠశాలల నుంచి పరీక్షా కేంద్రానికి వెళ్లేందుకు బస్సు చార్జీలు చెల్లించలేని విద్యార్థులున్న పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుడు, వార్డెన్‌లే ఆయా సొమ్మును చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది. ఎక్కువ చోట్ల బస్సు చార్జీలను విద్యార్థులు కంటే, హెచ్‌ఎం, వార్డెన్లే చెల్లిస్తున్నారు. అధికారులు ఒత్తిడి చేసి తమతో బస్సు చార్జీలను చెల్లింపజేయడం దారుణమని పలువురు టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే బస్సు చార్జీలను చెల్లించలేని విద్యార్థులను ఆటోల్లో తరలిస్తామంటే అధికారులు అంగీకరించకపోగా, తమకు మెమోలు ఇస్తామని బెదిరిస్తున్నారని టీచర్లు వాపోతున్నారు. దీంతో చేసేది లేక సొంత సొమ్ముతోనైనా విద్యార్థులను బస్సుల్లోనే పరీక్షా కేంద్రాలకు తరలిస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వం నిధులు కేటాయించకే...

గతంలో పదో తరగతి పరీక్షా కేంద్రాలకు తరలించేందుకు అయ్యే వ్యయాన్ని ప్రభుత్వమే భరించేది. దీంతో విద్యాశాఖాధికారులు అవసరమైనన్ని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయగా, ప్రభుత్వం అందుకు అయిన వ్యయాన్ని పీటీడీ యాజమాన్యానికి చెల్లించేది. కానీ గతేడాది నుంచి అందుకు భిన్నంగా విద్యార్థులు లేదా పాఠశాల యాజమాన్యమే బస్సు చార్జీలు చెల్లించుకునే పరిస్థితి ఏర్పడింది. గతేడాది హెచ్‌ఎంలు, వార్డెన్‌లే బస్సులకు అయ్యే ఖర్చులను పెట్టారు. అయితే ఆ విషయం ఈ ఏడాది వెలుగులోకి వచ్చింది. ఈ ఏడాది పలువురు హెచ్‌ఎంలు, వార్డెన్లు చేతులెత్తేయడంతో విద్యార్థుల నుంచే ఆయా చార్జీల సొమ్ములను టీచర్లు వసూలు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. టెన్త్ విద్యార్థుల రవాణాకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించకపోవడంతో చేసేది లేకనే అధికారులు చేతులెత్తేశారు. దీంతో విద్యార్థులు లేదా ఉపాధ్యాయులకు ఈ భారం తప్పడం లేదు. దేశంలోనే మిన్నగా విద్యా సంస్కరణలు చేపట్టామని గొప్పలు చెప్పుకొంటున్న వైసీపీ ప్రభుత్వం.. టెన్త్ విద్యార్థులకు ఉచిత ప్రయాణాన్ని సమకూర్చలేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మాట ఇచ్చి, మడమ తిప్పి..

ప్రైవేటు టీచర్లు, లెక్చరర్లకు జగన్ ధోకా

- కనీస వేతనాల అమలు, ఉద్యోగ భద్రతకు నాడు ప్రతిపక్ష నేతగా పాదయాత్రలో హామీ
- ఐదేళ్లు పూర్తయినా నెరవేర్చని వైనం
- అధికారంలోకి వచ్చిన తరువాత రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు



- ఇప్పటికీ వెలుగుచూడని నివేదిక
- ఉమ్మడి జిల్లాలో సుమారు 35 వేల మంది ప్రైవేటు టీచర్లు, లెక్చరర్లు
- వైసీపీ సర్కారుకు గుణపాఠం చెబుతామంటున్న ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు

విశాఖపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి):

"ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు కనీస వేతనాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం. ప్రైవేటు టీచర్ల స్థితిగతులు మెరుగుపర్చేందుకు ఒక రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటుచేస్తాం. ఆ కమిషన్ ఇచ్చే నివేదిక మేరకు మెరుగైన పరిస్థితులు తీసుకువస్తాం"

-పాదయాత్ర సమయంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ.



పాదయాత్ర సమయంలో ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్ డిమాండ్ల ఫ్లెక్సీని ప్రదర్శిస్తున్న జగన్మోహన్‌రెడ్డి (ఫైల్ ఫోటో)

..అయితే, అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీని జగన్మోహన్‌రెడ్డి విస్మరించారని ప్రైవేటు టీచర్లు, లెక్చరర్లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. తమ డిమాండ్లతో కూడిన బ్యానర్‌ను కూడా పట్టుకుని మరీ పాదయాత్ర చేసిన జగన్మోహన్‌రెడ్డి..ఏరు దాటిన తరువాత తెప్పను తగలేసినట్టు అధికారంలోకి వచ్చిన తరువాత తమను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రైవేటు టీచర్లు, లెక్చరర్లు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు మూడు లక్షల మంది వరకూ ఉండగా, ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 300కుపైగా కాలేజీలు, స్కూల్స్‌లో 35 వేల మంది వరకూ పనిచేస్తున్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న వీరికి కనీస వేతనాలు అందడం లేదు. ఇప్పటికీ దాదాపు 70 శాతం మందికి రూ.5 వేలు నుంచి రూ.15 వేల మధ్య వేతనంగా లభిస్తోంది. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే, వారికి పీఎఫ్, ఈఎస్ఐ వంటివి అమలు చేయడం లేదు. అదేవిధంగా ఏడాదిలో పది నెలలకు మాత్రమే వేతనాలను పొందు తున్నారు. వేసవి సెలవుల్లో చాలా స్కూల్స్ యాజమాన్యాలు జీతాలు ఇవ్వడం లేదు.

ప్రైవేటు స్కూల్స్, కాలేజీల్లో పనిచేసే టీచర్లు/లెక్చరర్లతోపాటు ఆయాలు, బస్ డ్రైవర్లకు కనీస వేతనాలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాన్ని కల్పించాలని, వేసవి సెలవుల్లో కూడా జీతాలు చెల్లించేలా, ప్రభుత్వ సెలవులు వర్తించేలా చూడాలని, జీవో నంబర్ ఎంఎస్-1ను విధిగా అమలు చేయాలని, ప్రధానంగా ఉద్యోగ భద్రతను కల్పించాలని చాలాకాలంగా కోరుతున్నారు. ఆ హామీలను నెరవేరుస్తానని నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా పలుమార్లు మాట ఇచ్చారు. ఇందుకోసం రెగ్యులరేటరీ కమిషన్‌ను ఏర్పాటుచేస్తానని హామీ ఇచ్చారు.

నివేదిక ఏమైనట్టు..?

జగన్మోహన్‌రెడ్డి 2019లో అధికారంలోకి వచ్చిన తరువాత రెగ్యులేటరీ కమిషన్‌ను ఏర్పాటుచేశారు. ఆలూరి సాంబశివా రెడ్డి నేతృత్వంలో ఏర్పాటైన ఈ కమిషన్ అనేక అంశాలను కూలంకుషంగా పరిశీలించి నివేదికను సమర్పించింది. అయితే, ఐదేళ్లు కావస్తున్నా ఆ కమిషన్ ఇచ్చిన నివేదికను ప్రభుత్వం బహిర్గతం చేయలేదు. కమిషన్ ఏం నివేదిక ఇచ్చిందో ఇప్పటివరకూ చెప్పలేదని, ప్రభుత్వం ఏర్పాటై ఐదేళ్లు పూర్తయినా ఇప్పటికీ తమకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని టీచర్లు, లెక్చరర్లు వాపోతున్నారు. ప్రైవేటు కాలేజీలు, స్కూల్స్‌లో పనిచేసే సిబ్బందిని జగన్మోహన్‌రెడ్డి నమ్మించి మోసం చేశారని ప్రైవేటు టీచర్స్ అండ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.లోకనాథం విమర్శించారు. రాష్ట్రంలో తాము నాలుగు లక్షల మంది ఉన్నామని, కుటుంబ సభ్యులతో కలిపితే సుమారు పది లక్షల ఓట్లు ఉంటాయన్నారు. తమను మోసం చేసిన ఈ సర్కారుకు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టంచేశారు. ఐదేళ్ల కిందట ఏర్పాటుచేసిన రెగ్యులేటరీ కమిషన్ ఇచ్చిన నివేదికను బహిర్గతం చేయకుండా ఎందుకు మోసం చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.



పట్టుబడిన గంజాయి, నిందితులతో ఏఎస్పీ, కొయ్యూరు, మంప పోలీస్ స్టేషన్ల సిబ్బంది

532 కిలోల గంజాయి స్వాధీనం

ముగ్గురి అరెస్టు

కొయ్యూరు, మార్చి 20: మండలంలోని డౌనూరు పంచాయతీ బచ్చింత గ్రామ శివారులో బుధవారం 532 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్టు చేశామని చింతపల్లి అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ తెలిపారు. కొయ్యూరు, మంప స్టేషన్లను తనిఖీ చేయడానికి వచ్చిన ఆయన ఈ వివరాలను వెల్లడించారు. కొయ్యూరు మండలం డౌనూరు పంచాయతీ బచ్చింత గ్రామ శివారులో భారీగా గంజాయి ఉన్నట్టు బుధవారం మధ్యాహ్నం కొయ్యూరు ఏఎస్‌ఐకి సమాచారం అందింది. దీంతో ఆయన సిబ్బందితో ఆ గ్రామానికి వెళ్లారు. నలుగురు వ్యక్తులు కొన్ని బస్తాలను పట్టుకుని ఉండడాన్ని గమనించారు. అయితే పోలీసులను చూసి వారు పారిపోయే ప్రయత్నం చేశారు. వారిని పోలీసులు వెంబడించి ముగ్గురిని పట్టుకున్నారు. మరొకరు మాత్రం తప్పించుకున్నారు. పట్టుబడిన నిందితులు బచ్చింత గ్రామానికి చెందిన పాంగి సుందర రావు, వంతల చిన్న, పాంగి మాణిక్యంగా పోలీసులు గుర్తించారు. వారిని విచారించగా గంజాయిని ఒడిశా రాష్ట్రం నరేడుమిల్లి గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి కొనుగోలు చేసినట్టుగా తెలిపారు. 17 బస్తాల్లో ఉన్న 532 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఆ ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఏఎస్పీ చెప్పారు. పోలీసుల నుంచి తప్పించుకున్న మరో వ్యక్తి కోసం గాలిస్తున్నామన్నారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న కొయ్యూరు ఏఎస్‌ఐతో పాటు సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు. ఏఎస్పీ వెంట కొయ్యూరు సీఐ వెంకటరమణ, కొయ్యూరు ఎస్ఐ రామకృష్ణ, మంప ఎస్ఐ లోకేశ్‌కుమార్, దేముడు, సిబ్బంది పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురు)	6.11
సహరి (శుక్ర)	4.47

16 విభాగాలు 19 మంది నోడల్ అధికారులు



జిల్లాలోని ఎన్నికల నోడల్ అధికారులు

సార్వత్రిక ఎన్నికల్లో పర్యవేక్షణకు నియామకం

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు 16 విభాగాల్లో 19 మంది నోడల్ అధికారులను నియమించారు. వారంతా వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న జిల్లా స్థాయి అధికారులే. ఆయా అధికారులు ఎన్నికల నేపథ్యంలో చోటు చేసుకునే వివిధ అంశాలపై పరిశీలన, పర్యవేక్షణ వంటి చర్యలు చేపడతారు. అవసరం మేరకు ఆయా అంశాలపై జిల్లా ఎన్నికల అధికారికి నివేదికలు సమర్పిస్తారు. జిల్లా ఎన్నికల అధికారి వీటిని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు అందజేస్తారు. సార్వత్రిక ఎన్నికల్లో నోడల్ అధికారుల పాత్ర ఎంతో కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత పలుమార్లు వారితో సమావేశమై దిశానిర్దేశం చేశారు.

జిల్లాలో నోడల్ అధికారులు వీరే..

జిల్లాలో ఎన్నికల ప్రక్రియలో పర్యవేక్షణకు 19 మంది నోడల్ అధికారులను ఎన్నికల కమిషన్ ఆదేశాలతో నియమించారు. వీరిలో మేన్‌పవర్ మేనేజ్‌మెంట్ విభాగానికి ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావు, ట్రైనింగ్ మేనేజ్‌మెంట్‌కు డిప్యూటీ డీఈవో ఎస్.చెల్లయ్య, జిల్లా ఆడిట్ అధికారి సువర్ణపణి, మెటీరియల్ మేనేజ్‌మెంట్‌కు జిల్లా పట్టుపరిశ్రమ అధికారి కె.అప్పారావు, ట్రాన్స్‌పోర్టు మేనేజ్‌మెంట్‌కు జిల్లా రవాణాశాఖాధికారి లీలాప్రసాద్, కంప్యూటరైజ్, సైబర్, ఐటీ మేనేజ్‌మెంట్‌కు కలెక్టరేట్‌కు చెందిన కె.సునీల్‌కుమార్, ఎస్‌బీఈఈపీ మేనేజ్‌మెంట్‌కు గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వీవీఎస్ శర్మ, లా అండ్ ఆర్డర్, భద్రతా మేనేజ్‌మెంట్‌కు ఏఎస్పీ కె.ధీరజ్, సైబర్ విభాగం సీఐ బి.సుధాకర్, ఈవీఎంల మేనేజ్‌మెంట్‌కు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.మురళి నియమితులయ్యారు. అదేవిధంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ మేనేజ్‌మెంట్‌కు డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.శివయ్య, రంపచోడవరం డీఎల్‌పీవో రాఘవయ్య, ఎన్నికల వ్యయం మేనేజ్‌మెంట్‌కు జిల్లా ఆడిట్ అధికారి సువర్ణపణి, బ్యాలెట్ పేపర్, పోస్టర్ బ్యాలెట్ మేనేజ్‌మెంట్‌కు జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నంద్, మీడియా మేనేజ్‌మెంట్‌కు జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి పి.గోవింద రాజులు, కమ్యూనికేషన్ ప్లాన్ మేనేజ్‌మెంట్‌కు జిల్లా ఉద్యానవనశాఖాధికారి ఎ.రమేశ్‌కుమార్‌రావు, ఓటర్లు జాబితాల మేనేజ్‌మెంట్‌కు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భవాని, ఫిర్యాదులు, ఓటర్స్ హెల్ప్‌లైన్ మేనేజ్‌మెంట్‌కు జిల్లా సహకార శాఖాధికారి ఎం.వెంకటరామకృష్ణరాజు, పరిశీలకుల మేనేజ్‌మెంట్‌కు నోడల్ అధికారిగా జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రశాంత్‌కుమార్‌ను నియమించారు.



స్వాధీనం చేసుకున్న నాటు తుపాకులతో అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్

నాటు తుపాకులు అప్పగించాల్సిందే..

- పట్టుబడితే పదేళ్ల జైలు
- ఇప్పటి వరకు సబ్ డివిజన్ పరిధిలో 25 స్వాధీనం
- అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్

చింతపల్లి, మార్చి 20: నాటు తుపాకులు కలిగి ఉండడం చట్టరీత్యా నేరమని, పోలీసులకు పట్టుబడితే పదేళ్ల వరకు జైలు శిక్ష పడుతుందని స్థానిక అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ తెలిపారు. బుధవారం పోలీసు సబ్ డివిజన్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. తొలుత ఆదివాసీల నుంచి నాటు తుపాకులను సేకరించిన పోలీసులు, ఎస్ఐలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ ఆదివాసీలు నాటు తుపాకులు కలిగి వుంటే స్వచ్ఛందంగా పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలని జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా పిలుపునివ్వడంతో స్పందన వచ్చిందన్నారు. చాలా మంది స్వచ్ఛందంగా తుపాకులను అప్పగించారని చెప్పారు. చింతపల్లి, జీకేవీధి, చింతపల్లి మండలాల్లో 25 నాటు తుపాకులను స్వాధీనం చేసుకున్నామన్నారు. నాటు తుపాకులను ... మిగతా 8వ పేజీలో

జలాశయాలు వెలవెల



మండలంలోని గలగండలో అడుగంటిన మత్స్యగెడ్డ

జోలాపుట్టు, డుడుమల్లో తగ్గిన నీటిమట్టం

- మత్స్యగెడ్డ పాయలు అడుగంటడమే కారణం
- నీటి వృథాను అరికట్టడంలో నిర్లక్ష్యం
- మాచ్‌ఖండ్‌లో దిగజారిన విద్యుదుత్పత్తి
- ముందస్తు చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపణలు

ముంచంగిపుట్టు, మార్చి 20: నిండు కుండను తలపించేలా ఉండే జోలాపుట్టు, డుడుమ జలాశయాలు ఇప్పుడు నీరు లేక వెలవెలబోతున్నాయి. మత్స్యగెడ్డ ప్రవాహిత నీటిపై ఆధారపడి ఉన్న ఈ రెండు జలాశయాల్లో ప్రస్తుతం నీటి నిల్వలు ఆశించిన స్థాయిలో నమోదు కావడం లేదు.

గతేడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. ఈ ఏడాది వేసవి ప్రారంభం నుంచే ఎండలు ఠారెత్తిస్తున్నాయి. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. దీని వల్ల మండల పరిధిలో గల సుజనకోట, పెదగూడ, దారెల, లక్ష్మీపురం, పనసపుట్టు, రంగబయలు తదితర పంచాయతీల్లోని పలు గ్రామాల్లో ప్రవహించే మత్స్యగెడ్డ పాయల్లో రోజు రోజుకు నీటి నిల్వలు తగ్గుముఖం పడుతున్నాయి. దీంతో నీరు లేక జోలాపుట్టు, డుడుమ జలాశయాలు వెలవెలబోతున్నాయి.

తగ్గిన నీటిమట్టం

జోలాపుట్టు జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 2750 అడుగులు కాగా, బుధవారం 2703.5 అడుగుల నీటిమట్టం నమోదైంది. గతేడాది ఇదే సమయానికి ఈ జలాశయంలో 2730.7 అడుగుల నీటిమట్టం ఉంది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది సుమారు 27 అడుగుల నీటిమట్టం తక్కువగా ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

ట్రాక్టర్‌ను ఢీకొన్న ట్రావెల్ బస్సు

» తీవ్రంగా గాయపడి మృతిచెందిన యువకుడు


మీరా సాహెబ్ (ఫైల్ ఫొటో)

ఎలమంచిలి, మార్చి 20: ట్రాక్టర్‌ను డ్రైవర్ అప్పగించి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లిన ఆ యువకుడు, రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. తండ్రికి ఫోన్ చేసి తాను ప్రమాదానికి గురైనట్టు చెప్పాడు. కొద్దిసేపట్లో అక్కడకు చేరుకున్న తండ్రి.. పోలీసుల సాయంతో కుమారుడిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్లాడు. కానీ అప్పటికే పరిస్థితి విషమించడంతో తండ్రి చేతుల్లోనే ప్రాణాలు వదిలాడు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

ఎస్.రాయవరం మండలం ఒమ్మవరం గ్రామానికి చెందిన షేక్ మీరాసాహెబ్(27) ఉపాధి నిమిత్తం ఇటీవల ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. ఇతని తండ్రి షేక్ నన్నాసాహెబ్ ఒమ్మవరంలో చికెన్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఎలమంచిలి మండలం పులపర్తికి చెందిన ఒక వ్యక్తిని డ్రైవర్‌గా నియమించుకున్నాడు. మంగళవారం రాత్రి ట్రాక్టర్‌ను అతనికి అప్పగించి వస్తానని ఇంటివద్ద చెప్పి బయలుదేరాడు. పదిన్నర గంటల సమయానికి పులపర్తి సమీపంలోకి వచ్చాడు. ఇదే సమయంలో వెనుక నుంచి వస్తున్న ఒక ట్రావెల్ బస్సు ఓవర్‌టేక్ చేసే క్రమంలో ట్రాక్టర్‌ను ఢీకొన్నది. దీంతో ట్రాక్టర్ స్టీరింగ్ మీరాసాహెబ్ కడుపునకు బలంగా తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తనకు ప్రమాదం జరిగినట్టు తండ్రికి ఫోన్ చేసి చెప్పాడు. నన్నాసాహెబ్ కొద్దిసేపట్లోనే సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసుల సహాయంతో అంబులెన్స్‌లో ఎలమంచిలి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అయితే అంతర్గత అవయవాలకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స పొందుతూ తండ్రి చేతిలోనే ప్రాణాలు వదిలాడు. దీంతో నన్నాసాహెబ్ కన్నీరుమున్నీరు అయ్యాడు. కాగా మీరాసాహెబ్‌కు సుమారు ఆరు నెలల క్రితం వివాహమైందని, భార్య ప్రస్తుతం మూడు నెలల గర్భిణి అని కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్‌ఐ సింహాచలం చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

అనకాపల్లి టౌన్, మార్చి 20: పట్టణానికి సమీపంలోని జలగలమదుం జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. దీనికి సంబంధించి ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మాకవరపాలెం మండలం పి.అగ్రహారం గ్రామానికి చెందిన కడారి గంగతల్లి (54) క్యాన్సర్‌తో బాధపడుతుండడంతో ఆమెను అల్లుడు జి.దారబాబు అగనంపూడి వద్ద గల క్యాన్సర్ ఆస్పత్రికి ద్విచక్ర వాహనంపై బుధవారం ఉదయం తీసుకువెళుతున్నాడు. జలగలమదుం జంక్షన్ వద్దకు వచ్చే సరికి ప్రమాదవశాత్తూ గంగతల్లి వాహనం పైనుంచి పడిపోవడంతో తలకు బలమైన గాయాలు తగిలాయి. విశాఖ కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

ఎలమంచిలి, మార్చి 20: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఎస్.రాయవరం మండలం ఒమ్మవరం గ్రామానికి చెందిన నూర్ బుధవారం ద్విచక్ర వాహనంపై ఎలమంచిలి వస్తున్నాడు. ఎలమంచిలి మండలం యర్రవరం పొలిమేరమ్మతల్లి అమ్మవారి ఆలయ సమీపానికి వచ్చేసరికి యర్రవరం నుంచి వస్తున్న మరో ద్విచక్ర వాహనం అతనిని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన నూర్‌ను స్థానికులు ఎలమంచిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా మంగళవారం రాత్రి పులపర్తి సమీపంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు ఎలమంచిలి వస్తుండగా నూర్ ఈ ప్రమాదానికి గురైనట్టు తెలిసింది.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, మార్చి 20: దేవరాపల్లి మండలం బల్లిపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్టు బుధవారం ఫిర్యాదు అందిందని పట్టణ హెడ్‌కానిస్టేబుల్ బి.రామకృష్ణ తెలిపారు. దేవరాపల్లి మండలం బల్లిపురం గ్రామానికి చెందిన తామర్ల కొండబాబు గోదావరి జిల్లాల్లో వ్యవసాయ పనులకు వెళ్లి ఈ నెల మూడో తేదీన అరకుకు చెందిన వ్యక్తితో ఆర్టీసీ బస్సులో అనకాపల్లికి చేరుకున్నాడు. అరకుకు చెందిన వ్యక్తి స్వగ్రామం వెళ్లిపోగా, కొండబాబు ఆచూకీ లభించకపోవడంతో అతని తండ్రి బుచ్చిబాబు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

4 కిలోల గంజాయి స్వాధీనం: ఒకరి అరెస్టు

అనకాపల్లి టౌన్, మార్చి 20: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని గూడ్స్ షెడ్ వద్ద బుధవారం తమిళనాడుకు చెందిన ఓ యువకుడిని అరెస్టు చేసి నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ సీఐ జి.శంకరరావు తెలిపారు. దీనికి సంబంధించి సీఐ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. తమిళనాడుకు చెందిన వరదరాజన్ గణేశ్(21) బుధవారం చోడవరం నుంచి నాలుగు కిలోల గంజాయితో తమిళనాడు వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు వస్తుండగా ఆ మార్గంలో ఎన్నికల విధుల్లో ఉన్న ఎస్‌ఐ సత్యనారాయణ, సిబ్బంది గణేష్‌కి అతనిపై అనుమానం వచ్చింది. అతని బ్యాగ్ తనిఖీ చేయగా నాలుగు కిలోల గంజాయి బయటపడిందన్నారు. ఈ మేరకు గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు సీఐ శంకరరావు తెలిపారు. కేసును ఎస్‌ఐ సత్యనారాయణ దర్యాప్తు చేస్తున్నారు.

కూండ్రంలో పశువుల పాక దగ్ధం

కొత్తూరు, మార్చి 20: మండలంలోని కూండ్రం గ్రామంలో పాడి పశువుల పాక బుధవారం తెల్లవారుజామున దగ్ధమైంది. సాలాపు నాగమణికి చెందిన పాడి పశువుల పాక ప్రమాదవశాత్తూ అగ్నికి ఆహుతైంది. ఒకే నెలలో గ్రామంలో ఇటువంటి పాడి పశువుల పాకలు నాలుగు దగ్ధం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

వృద్ధుడి సెల్‌ఫోన్ తస్కరించి బైక్‌పై పరారీ

చోడవరం, మార్చి 20: బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు, రోడ్డు పక్కన ఉన్న ఓ వృద్ధుడి నుంచి సెల్‌ఫోన్ తస్కరించుకుపోయిన ఘటన బుధవారం మండలంలోని జన్నవరం వద్ద చోటు చేసుకుంది. జన్నవరం గ్రామానికి చెందిన కడివి ఈశ్వరరావు ం జంక్షన్ సమీపంలో నిలబడి వున్నారు. ఈ సమయంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు అతని సమీపంలోకి వచ్చి పడిపోతున్నట్టు నటిస్తూ- 'పడిపోతున్నాం పట్టుకోండి' అని పిలిచారు. దీనితో వృద్ధుడు బైక్‌పై నుంచి యువకులు పడిపోకుండా పట్టుకున్నాడు. ఇదే సమయంలో ఆ యువకులు వృద్ధుడి నుంచి సెల్‌ఫోన్ గుంజుకుని అక్కడ నుంచి ఉడాయించారు. తన సెల్‌ఫోన్ పట్టుకుపోతున్నారని ఈశ్వరరావు కేకలు వేయడంతో స్థానికులు వాహనాలపై వారిని వెంబడించినా ఫలితం లేకపోయింది.

42 మద్యం బాటిళ్లతో ఒకరి అరెస్టు

చోడవరం: మండలంలోని గజపతినగరం జంక్షన్ సమీపంలో అదే గ్రామానికి చెందిన రాపేటి నరసింహ అనే వ్యక్తి నుంచి మంగళవారం రాత్రి 42 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు.

5 గంటలపాటు సంపూర్ణ వందేమాతరం గీతాలాపన


వందేమాతరం ఆలపిస్తున్న ధీరజ్

నర్సీపట్నం, మార్చి 20: బాల గాయకుడు, పాడుతా తీయగా విన్నర్ ధీరజ్ ఐదు గంటలుపాటు సంపూర్ణ వందేమాతరం గీతాన్ని ఆలపించి రికార్డ్ సృష్టించాడు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా బుధవారం శారదానగర్ శ్రీసత్యసాయి మందిరంలో ఏర్పాటు చేసిన 'కలిసి పాడుదాం' కార్యక్రమంలో వందేమాతరం గీతాన్ని 77 సార్లు ఆలపించాడు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్విరామంగా సంపూర్ణ వందేమాతర గీతం పాడాడు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439

స్వర్ణాలంకరణలో వెంకన్న

» కల్యాణోత్సవాల సందర్భంగా భక్తులకు విశిష్ట దర్శనమిచ్చిన స్వామివారు

» ఘనంగా ధ్వజారోహణం... అర్ధరాత్రి కల్యాణవేడుక


ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి, మార్చి 20: ఉపమాక క్షేత్రంలో వార్షిక కల్యాణోత్సవాల సందర్భంగా వేంకటేశ్వరస్వామి బుధవారం స్వర్ణాలంకరణలో భక్తులకు విశిష్ట దర్శనమిచ్చారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఆలయ అర్చకులు, టీటీడీ అధికారులు.. ఉభయ దేవేరులతోపాటు వేంకటేశ్వరస్వామి వారిని పలు రకాల ఆభరణాలతో అలంకరించారు. తొలుత తెల్లవారుజామున మూడు గంటలకు కొండపై వున్న స్వామి నిజరూపానికి ఆలయ అర్చకులు ప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతించారు. ఇదే సమయంలో కొండ దిగువ ఆలయంలో స్వర్ణాలంకరణలో వున్న స్వామి వారిని రాతి కల్యాణ మండపంలో ఆశీనులనుగావించి భక్తులు దర్శించుకోవడానికి ద్వారాలు తెరిచారు. అప్పటికే వేలాది మంది భక్తులతో ఆలయ ప్రాంగణం, గరుడాద్రి పర్వతం మెట్లమార్గం నిండిపోయింది. కాగా ఏటా ఫాల్గుణ శుద్ధ ఏకాదశి (కల్యాణోత్సవం) రోజున మాత్రమే ఉభయదేవేరులతో కూడిన స్వామివారు వజ్రవైఢూర్యాలు, పచ్చలు, కెంపులతో పొదిగిన బంగారు కిరీటాలు, చింతాకుపతకాలు, కంఠిలు, తదితర ఆభరణాలతో భక్తులకు దర్శనమిస్తారు. కల్యాణ వేంకటేశ్వరుడిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని మాడవీధుల్లో ఊరేగించారు. తరువాత ఆలయంలో ధ్వజస్తంభం వద్ద ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో ధ్వజారోహణ నిర్వహించారు. కాగా విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్నీ, జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ, తదితరులు ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు స్వామివారి చిత్రపటాన్ని, శేషవస్త్రాన్ని బహూకరించి, వేద ఆశీర్వచనం చేశారు.



స్వర్ణాలంకరణలో దర్శనమిస్తున్న ఉపమాక వెంకన్నను దర్శించుకుంటున్న డీఐజీ విశాల్ గున్నీ, జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ

'పేట'లో లక్కీ షాపింగ్ మాల్ ప్రారంభం


కొత్త డిజైన్ పట్టు చీరను ప్రదర్శిస్తున్న సినీ నటి, యాంకర్ అనసూయ. చిత్రంలో సంస్థ ప్రతినిధులు

పాయకరావుపేట, మార్చి 20 : పాయకరావుపేటలో బుధవారం లక్కీ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. పట్టణంలోని చిత్రమందిర్ థియేటర్ ఎదుట ఏర్పాటుచేసిన ఈ షాపింగ్ మాల్‌ను ప్రముఖ యాంకర్, సినీ నటి అనసూయ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా కొత్త డిజైన్లు, నాణ్యత, అందరికీ అందుబాటులో ఉండే ధరలకు అన్ని రకాల వస్త్రాలను అందజేస్తున్న లక్కీ షాపింగ్ మాల్‌ను పాయకరావుపేట, తుని పరిసర ప్రాంతాల ప్రజలు సందర్శించాలన్నారు. అనంతరం ఆమె షాపింగ్ మాల్‌లో ఉన్న కొత్త డిజైన్ల పట్టు చీరలను ప్రదర్శించారు. అలాగే అనకాపల్లి ఎంపీ కె.సత్యవతి, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, జిల్లా వ్యవసాయ అభివృద్ధి సలహా మండలి చైర్మన్, వైసీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, తుని నియోజకవర్గ టీడీపీ నేత యనమల కృష్ణుడు తదితరులు జ్యోతి ప్రజ్వలనచేసి షాపింగ్ మాల్‌లోని వివిధ విభాగాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో షాపింగ్ మాల్ ప్రతినిధులు జి.శ్రీనివాసరావు, ఎస్.రత్తయ్య, కట్టా నూకరాజు, గిరిధర్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు. కాగా పాయకరావుపేటలో లక్కీ షాపింగ్ మాల్‌ను ప్రారంభించేందుకు వచ్చిన సినీ నటి అనసూయను చూసేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావడంతో స్థానిక చిత్రమందిర్ సెంటర్ కిక్కిరిసింది. షాపింగ్ మాల్ ఎదుట నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

రాష్ట్రస్థాయి ఉత్సవంగా నూకాంబిక కొత్త అమావాస్య జాతర

» జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ


నూకాంబికను దర్శించుకున్న కొణతాల

అనకాపల్లి టౌన్, మార్చి 20: రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే స్థానిక నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరను రాష్ట్రస్థాయి ఉత్సవంగా నిర్వహిస్తామని అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ తెలిపారు. ఏకాదశి పర్వదినం సందర్భంగా బుధవారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించడంలో భాగంగా నూకాంబిక అమ్మవారిని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణలతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆయనను ఆశీర్వదించారు. అనంతరం స్థానిక విలేకరులతో శ్రీనివాస కల్యాణ మండపంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉమ్మడి ప్రభుత్వం రావడం ఖాయమని, వచ్చిన వెంటనే కొత్త అమావాస్య ఉత్సవాలను రాష్ట్రస్థాయి ఉత్సవంగా నిర్వహిస్తామన్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ఆలయానికి తీసుకువస్తానని చెప్పారు. అనకాపల్లిలో తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో కల్యాణ మండపం నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. అలాగే ఒక ఏడాది నంది ఉత్సవాలు అనకాపల్లిలో తప్పనిసరిగా నిర్వహించేందుకు కృషి చేస్తానని ఆయన చెప్పారు.

ప్రాధాన్యతారంగాలపై బ్యాంకులు దృష్టి పెట్టాలి

» కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి):
జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే బ్యాంకర్లు వ్యవసాయం, చిన్న పరిశ్రమలు, స్వల్పకాలిక వ్యవసాయ రుణాలపై మరింత దృష్టి పెట్టాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో బ్యాంకు అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ స్వల్పకాలిక రుణాలు అందజేయాలన్నారు. తోటలు, కూరగాయాలు, పశు సంవర్థక, డెయిరీ, మత్స్య పరిశ్రమలలో కాలానుగుణంగా ఉత్పత్తి సాధించే రంగాలకు ఆర్థిక చేయూత ఇవ్వాలని సూచించారు. లీడ్ బ్యాంకు మేనేజరు సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో రుణ ప్రణాళికను వివరించారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.5,088.12కోట్లు, ఎంఎస్‌ఎంఈకి రూ.1,566.62 కోట్లు కేటాయించామని తెలిపారు. సమావేశంలో యూనియన్ బ్యాంకు ప్రాంతీయ అధికారి పి.నరేశ్, నాబార్ డీడీఎం సుమంత్‌కుమార్, మెప్మా పీడీ సరోజిని తదితరులు పాల్గొన్నారు.

అనితపై అసత్య వార్త.. పోలీసులకు టీడీపీ ఫిర్యాదు

పాయకరావుపేట, మార్చి 20: తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనితపై సోషల్ మీడియాలో వేటూ న్యూస్ పేరిట వచ్చిన ఫేక్ న్యూస్‌పై పోలీసులు పూర్తి విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి పలువురు టీడీపీ నాయకులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం పట్టణంలో ఓ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత షాపింగ్ మాల్ యాజమాన్యాన్ని బెదిరించి సుమారు రూ.50 లక్షల విలువైన చీరలు తీసుకెళ్లిపోయారని, దీనిపై షాపింగ్‌మాల్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేశారంటూ వేటూ న్యూస్ పేరిట వార్తను సోషల్ మీడియాలో పోస్టు చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో పాయకరావుపేట అసెంబ్లీకి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీచేస్తున్న వంగలపూడి అనితకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ఫేక్ వార్తను అధికార పార్టీ అండతో సోషల్ మీడియాలో పోస్టు చేశారని ఆరోపించారు. దీనిపై పోలీసులు పూర్తిస్థాయి విచారణ చేసి బాధ్యులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పల్లా విలియంకేరీ, చింతకాయల రాంబాబు, ఎం.రమాకుమారి, లెక్కల గోవిందు, పి.సూరిబాబు, వేములపూడి అప్పారావు, ఆది, సీహెచ్.పేర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఏఆర్ఎస్‌లో అమ్మకానికి చెరకు విత్తనం

అనకాపల్లి అగ్రికల్చర్, మార్చి 20 : ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో చెరకు విత్తనం అందుబాటులో వుందని, అవసరమైన రైతులు కొనుగోలు చేసుకోవచ్చని శాస్త్రవేత్త డాక్టర్ పి.వి.పద్మావతి తెలిపారు. 2009ఏ107 వశిష్ఠ రకం నాలుగు టన్నులు, 2009ఏ252 నవీన్ రకం ఐదు టన్నులు వుందని, కొత్త వంగడం 2010ఏ 229 రకం ఏడు టన్నుల విత్తనం అందుబాటులో వుందని పేర్కొన్నారు. మొదటి రెండు రకాలు టన్ను రూ.2,800, చివరి రకం టన్ను రూ.3000లకు విక్రమిస్తున్నట్టు చెప్పారు. వివరాలకు 9704074493 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

ప్రశాంతంగా టెన్త్ ఇంగ్లీషు పరీక్ష

అనకాపల్లి రూరల్, మార్చి 20: పదో తరగతి పరీక్షల్లో భాగంగా బుధవారం ఇంగ్లీషు పరీక్షను ప్రశాంతంగా నిర్వహించినట్టు డీఈవో వెంకటలక్ష్మి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 21,229 మందికి గాను 21,123 మంది హాజరు కాగా, 106 మంది గైర్హాజరు అయ్యారన్నారు. అలాగే ప్రైవేటు విద్యార్థులు 229 మంది హాజరుకావాల్సి ఉండగా, 92 మంది హాజరై 137 మంది గైర్హాజరు అయినట్టు ఆమె తెలిపారు.

సైకిల్‌పై అయోధ్య చేరిన మణీంద్ర


అయోధ్యలో మణీంద్ర

అచ్యుతాపురం, మార్చి 20: అచ్యుతాపురం నుంచి సైకిల్‌పై బయలుదేరిన మణీంద్ర క్షేమంగా అయోధ్య చేరుకున్నాడు. అచ్యుతాపురం మండలం కొల్లివానిపాలేనికి చెందిన పైల మణీంద్ర(28) ఈ నెల 11న అచ్యుతాపురం ఎంపీడీవో కార్యాలయం నుంచి సైకిల్‌పై బయలు దేరాడు. ఈ నెల 19వ తేదీ రాత్రి ఏడు గంటలకు మణీంద్ర అయోధ్య చేరుకున్నాడు. మొత్తం 17 వందల కిలోమీటర్ల ప్రయాణాన్ని తొమ్మిది రోజుల్లో పూర్తి చేశాడు.

కానిస్టేబుల్, హోంగార్డుకు నగదు రివార్డు

అనకాపల్లి రూరల్, మార్చి 20: ఆటోలో గంజాయి తరలిస్తున్న ముగ్గురు నిందితులను పట్టుకున్న పోలీసు, హోంగార్డుకు ఎస్పీ కేవీ మురళీకృష్ణ బుధవారం రివార్డులు అందజేశారు. సబ్బవరం స్టేషన్ కానిస్టేబుల్ వి.వరదేశినాయుడు, హోంగార్డు జె.నాగేశ్వరరావు మంగళవారం తెల్లవారుజాము చింతపల్లి నుంచి సబ్బవరం మీదుగా తునికి గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులను పట్టుకున్నారు. విధులను సక్రమంగా నిర్వహించినందుకు వీరికి బుధవారం నగదు రివార్డును అందించారు.

వడ్డాది వెంకన్న కల్యాణోత్సవాలు ప్రారంభం

» స్వామివారి దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు


స్వామి వారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

బుచ్చెయ్యపేట, మార్చి 20: మండలంలోని వడ్డాది గిరిజాంబ గిరిపై కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాల ను బుధవారం ధ్వజారోహణం, అంకురార్పణతో ఘనంగా ప్రారంభించారు. అంతకు ముందు స్వామి, అమ్మవార్లను పసిడి ఆభరణాలతో అలంకరించారు. అర్చకులు సహస్రనామ, అష్టోత్తర నామాలతో పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తుల రద్దీ పెరిగిపోవడంతో పోలీసులు అప్రమత్తమై వాహనాలను కొండ దిగువనే నిలిపివేశారు. భక్తులు క్యూలైన్లలో బారులు తీరడంతో స్వామి వారికి అభిషేకాలు నిలిపివేసి, దర్శనం మాత్రమే కల్పించారు. వేద పండితులు రాత్రి 9.30 గంటలకు స్వామివారి కల్యాణోత్సవాన్ని ప్రారంభించారు. మంత్రోచ్ఛరణల మధ్య శాస్త్రోయుక్తంగా తిరుకల్యాణం నిర్వహించారు. ఈ ప్రక్రియ ముగిసే సరికి అర్ధరాత్రి అయ్యింది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. భక్తుల గోవింద నామస్మరణలతో గిరిజాంబగిరి మారుమోగింది. కాగా కొత్తకోట సీఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ డి.ఈశ్వరరావు, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. విద్యుత్ సరఫరాకు పలుమార్లు అంతరాయం ఏర్పడడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు.

జగన్ ఓటమే లక్ష్యంగా పనిచేస్తాం

» సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు. చిత్రంలో సంఘానికి చెందిన ఇతర ప్రతినిధులు ఉన్నారు

విశాఖపట్నం, మార్చి 20: రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓటమే ధ్యేయంగా పనిచేస్తామని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు ప్రకటించారు. బుధవారం డాబాగార్డెన్స్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసి, సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చారని ఆరోపించారు. పంచాయతీల్లో సమస్యలపై తమ సంఘం గత మూడున్నరేళ్లుగా ఆందోళనలు చేస్తున్నదన్నారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పంచాయతీలకు జరిగిన అన్యాయం వివరిస్తామన్నారు. సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు చింతకాయల ముత్యాలరావు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్ల ఏర్పాటు పంచాయతీరాజ్ వ్యవస్థకు పూర్తి విరుద్ధమని పేర్కొన్నారు. సర్పంచుల సమస్యలను పరిష్కరించే పార్టీలకే వచ్చే ఎన్నికల్లో మద్దతు ఇస్తామని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు సోమేశ్వరరావు, అప్పలరాజు, అమ్మోరు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచార అనుమతులకు సింగిల్ విండో: డీఆర్వో

అనకాపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల ప్రచారంతోపాటు ఇతర అనుమతులు పొందేందుకు కలెక్టర్ కార్యాలయంలో సింగిల్ విండో విభాగాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీలు/అభ్యర్థుల ఎన్నికల ప్రచారాలకు సంబంధించిన అనుమతులను ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు జారీ చేస్తారని చెప్పారు. అనుమతుల కోసం 'సువిధ' యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. హెలీకాప్టర్, హెలీప్యాడ్, ఎయిర్ బెలూన్‌లకు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ మాత్రమే అనుమతి ఇస్తారన్నారు. సభలు, సమావేశాలు, పార్టీ కార్యాలయాల ప్రారంభోత్సవాలు, ప్రచార వాహనాలు, ఊరేగింపులు, బారికేడ్ల నిర్మాణాలకు నియోజకవర్గాల ఆర్‌ఓల నుంచి అనుమతులు పొందాలన్నారు. ఇంటింట ప్రచారం, ర్యాలీలకు 48 గంటల ముందుగా అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లే వ్యక్తులు లేదా సంస్థలు ఇందుకు సంబంధించిన ఆధారాలతో ఏ అవసరం నిమిత్తం సొమ్ము తీసుకెళ్తున్నారో ముందుగా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమిటీ వద్ద నమోదు చేయించుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం పరిశీలకులు డి.రామ్మూర్తి, ఎస్వీ తులసీరామ్, తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు వద్ద తనిఖీలు, రూ.లక్ష నగదు సీజ్

కృష్ణాదేవిపేట, మార్చి 20: గొలుగొండ మండలం ఏఎల్‌పురం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు రూ.లక్ష నగదును సీజ్ చేసినట్టు ఎస్‌ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు. అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలం శరభవరం గ్రామానికి చెందిన నానిబాబు లక్ష రూపాయల నగదుతో తన స్నేహితుడు సాదనాల దుర్గాశివప్రసాద్‌తో కలిసి కృష్ణాదేవిపేట మీదుగా కారులో వెళుతున్నాడు. ఏఎల్‌పురం చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న పోలీస్ సిబ్బంది నగదు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి తగిన ఆధారాలు చూపకపోవడంతో నగదును సీజ్ చేశారు.

సక్రమంగా అమలుకాని ఎన్నికల కోడ్



మోసయ్యపేట ఫిష్ మార్కెట్‌లో సీఎం జగన్ బొమ్మతో వున్న బోర్డు

అచ్యుతాపురం, మార్చి 20: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా చాలా చోట్ల సీఎం జగన్, ఎమ్మెల్యేల చిత్రాలతో ఉన్న బోర్డులను అధికారులు తొలగించలేదు. ఆవసోమవరం సచివాలయానికి పక్కనే కిరాణా షాపు ఉంది. దానిపై సీఎం జగన్ ఫొటోతో బోర్డు ఉంది. దాన్ని ఇంకా తొలగించలేదు. ఇక అచ్యుతాపురం - గాజువాక ప్రధాన రహదారిలో గల మోసయ్యపేట సంతలో ఫిష్ మార్కెట్ బోర్డులపై తూతూ మంత్రంగా కాగితాలు అతికించారు. బుధవారం కురిసిన వర్షానికి అవి పోయాయి. బోర్డు యథావిధిగా కనిపిస్తున్నది. దుప్పితూరు పంచాయతీ సచివాలయాల ముఖద్వారంపై ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యే ఫొటోలు ఉండడంతో వాటిపై కాగితాలు అతికించారు. కాగా టీడీపీ సర్పంచులున్న పంచాయతీల్లో ఎన్నికల నియమావళిని సక్రమంగా అమలు చేస్తున్నారని, వైసీపీ సర్పంచులు ఉన్న పంచాయతీల్లో నియమావళి అమలు కావడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

రాత్రి వేళల్లో అనవసరంగా బయటకొస్తే కేసులు: సీఐ రమేష్



ముంచంగిపుట్టులో అర్ధ రాత్రి వాహనాల తనిఖీలు

ముంచంగిపుట్టు, మార్చి 20: అర్ధ రాత్రి 12 గంటలు దాటాక అనవసరంగా బయట సంచరించే వారిపై కేసులు నమోదు చేస్తామని జి.మాడుగుల సీఐ ఆర్.రమేష్ హెచ్చరించారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో దొంగతనాలు, దారి దోపిడీలు జోరుగా జరుగుతుండడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ పోలీసులు రాత్రి గస్తీ నిర్వహిస్తున్నారు. మంగళ వారం రాత్రి సీఐ రమేష్ నాలుగు రోడ్ల కూడలిపై వాహన తనిఖీలను చేపట్టారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ దొంగతనాల నివారణలో భాగంగా పలు నిబంధనలను విధించామని, అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. రాత్రి వేళల్లో ఆకతాయితనంగా, అనుమానాస్పదంగా బయట సంచరించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్టు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అలాగే ఎవరి వద్దనైనా నాటు తుపాకులు ఉంటే పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలని సీఐ సూచించారు. జోలాపుట్టులో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును పరిశీలించి, అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం, డబ్బులు తరలించే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని సీఐ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కె.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న పసుపు, మిరియాల ధరలు

హుకుంపేట, మార్చి 20: గిరిజనులు పండించే పసుపు, మిరియాల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. గత ఏడాది ఇదే సీజన్‌లో కిలో పసుపు రూ.45 నుంచి రూ.55 వరకు అమ్మకాలు జరిగాయి. ఈ ఏడాది పసుపు ప్రారంభం నుంచి రూ.80 నుంచి 140 వరకు మార్కెట్‌లో వ్యాపారులు పోటీపడిమరీ కోనుగోలు చేస్తున్నారు. మిరియాల ధరలు మొదట్లో రూ.550 వరకు వారపు సంతలోని కొనుగోలు చేశారు. రెండో వారం నుంచి వ్యాపారులు తగ్గించి కేవలం రూ.450 నుంచి రూ.460 వరకు తమకు నచ్చినట్టుగా విక్రయాలు జరిపారు. ఈ ఏడాది గిరిజన సహకార సంస్థ వారపు సంతలోని కనీసం పసుపు, మిరియాల ధరలు కూడా ప్రకటన చేయలేదని, అది చేసి ఉంటే మరింత ధర పలుకుతాయని గిరిజన రైతులు చెబుతున్నారు.

అసమర్థ పాలకులను గద్దె దించుదాం..

- టీడీపీ-జనసేన-బీజేపీ కూటమితోనే అభివృద్ధి సాధ్యం
- నియోజకవర్గ స్థాయి కూటమి నేతల సమావేశంలో అభ్యర్థి దొన్నుదొర

అరకులోయ, మార్చి 20: రాష్ట్రంలో అసమర్థ పాలకులను గద్దె దించుదామని అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి సియ్యారి దొన్నుదొర పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నాయకుల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుబడిందన్నారు. అరకులోయ నియోజకవర్గంలో పరిస్థితి మరీ దారుణంగా ఉందని, స్థానిక వైసీపీ పాలకులు ఒక్క ప్రాజెక్టును కూడా నియోజకవర్గంలో నెలకొల్పలేకపోయారని చెప్పారు. తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమితోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. గిరిజన రైతుల పంట భూములకు సాగునీటి సదుపాయం కూడా కల్పించకపోవడంతో వ్యవసాయం వదులుకోవాల్సిన దుస్థితి దాపురించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో చెక్‌డామ్‌ల నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో పంట కాలువల్లో పూడికలు పేరుకుపోయాయని, వాటిని తొలగించే చర్యలు చేపట్టకపోవడం వైసీపీ పాలకుల చేతగాని తనానికి నిదర్శనమని విమర్శించారు.

అలాగే గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించకపోవడంతో వేసవికి ముందే గిరిజనులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని వాపోయారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు చాలా మంది అర్హులకు అందడం లేదన్నారు. సైకో సీఎంకు పాలన చేతగాక రాష్ట్రాన్ని అప్పులాంధ్రప్రదేశ్‌గా మార్చేశారని ఆరోపించారు. ఇటువంటి అసమర్థ పాలకులను గద్దె దించాలని ఆయన పిలుపునిచ్చారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి వస్తే అన్ని వర్గాలు, ప్రాంతాల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే వారంతా వైసీపీని



కూటమి నాయకుల సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న దొన్నుదొర

ఇంటికి సాగనంపి కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో టీడీపీ అరకు నియోజకవర్గ పరిశీలకులు గణేష్, జనసేన నియోజకవర్గ కోఆర్డినేటర్ చిరంజీవి, బీజేపీ మండల అధ్యక్షుడు రామచంద్రరావు, అనంతగిరి, డుంబ్రిగుడ మండలాల అధ్యక్షులు బుజ్జిబాబు, సుబ్బారావు, జీసీసీ మాజీ చైర్మన్ శెట్టి లక్ష్మణుడు, పెదబయలు మాజీ ఎంపీపీ వెచ్చంగి కొండయ్య, బాకూరు సర్పంచ్ బి.వెంకటరమణ, జనసేన ఉమ్మడి విశాఖ జిల్లా ఆర్గనైజింగ్ ప్రధాన కార్యదర్శి సురేష్, పెదబయలు, హుకుంపేట మండలా జనసేన నాయకులు బాబూరావు, కోటిపడాల్, బీజేపీ జిల్లా కార్యదర్శి డొంబునాయుడు, గిరిజన మోర్చా జిల్లా కార్యదర్శి కె.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో సింగిల్ విండో విధానంలో అనుమతులు

- పాడేరు, అరకులోయ నియోజకవర్గాల ఆర్వోలు భావన వశిష్ఠ, అభిషేక్
- ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బృందాలకు ఎన్నికల పోర్టల్స్‌పై శిక్షణ





సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వోలు భావన వశిష్ఠ, అభిషేక్... శిక్షణలో పాల్గొన్న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బృందాల అధికారులు

పాడేరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ పార్టీల అభ్యర్థులకు అవసరమైన అనుమతులను సింగిల్ విండో విధానంలో జారీ చేస్తామని పాడేరు అసెంబ్లీ స్థానం రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ఠ, అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బృందాలకు ఎన్నికల పోర్టల్స్ నిర్వహణపై బుధవారం చేపట్టిన ఒక రోజు శిక్షణా కార్యక్రమంలో వారు మాట్లాడారు. రిటర్నింగ్ అధికారుల ఆమోదం లేకుండా ఎటువంటి అనుమతులు జారీ చేయకూడదన్నారు. అనుమతులు జారీ చేయడానికి సిబ్బంది స్వయం నిర్ణయాలు తీసుకోకూడదని స్పష్టం చేశారు. ఎన్నికలకు సంబంధించిన సువిధ, సివిజిల్, ఎన్‌కోర్, ఈఎస్ఎంఎస్ యాప్‌లపై వారికి అవగాహన కల్పించారు. అలాగే సువిధ యాప్ నుంచి దరఖాస్తులు స్వీకరించి, ఎన్‌కోర్ యాప్ ద్వారా ఆయా అనుమతులను జారీ చేస్తామన్నారు. ఎన్నికల్లో అన్ని రకాల ప్రచార కార్యక్రమాలకు రాజకీయ పార్టీలు విధిగా రిటర్నింగ్ అధికారుల నుంచి అనుమతులు పొందాలన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు ఆయా ఎన్నికల యాప్‌లపై అవగాహన ఏర్పరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, వీవీఎస్ శర్మ, పి.అంబేద్కర్, సీపీవో ఆర్‌కే.పట్నాయక్, పాడేరు ఎంపీడీవో సాయినవీన్, గ్రామ సచివాలయ వ్యవస్థ జిల్లా సమన్వయకర్త సునీల్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు నిరుత్సాహపడొద్దు

- అధిష్ఠానం పునరాలోచన చేస్తుందనే నమ్మకం ఉంది
- టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి

చింతపల్లి, మార్చి 20: కార్యకర్తలు, నాయకులు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, అధిష్ఠానం పునరాలోచన చేస్తుందనే నమ్మకం ఉన్నదని టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి సూచించారు. మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో బుధవారం చింతపల్లి, జీకే వీధి మండలాల పార్టీ కార్యకర్తలు, నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొత్తుల కారణంగా టీడీపీకి టికెట్ కేటాయించలేదని క్యాడర్ అసంతృప్తితో ఉన్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. నియోజకవర్గ ప్రజలు, పార్టీ కార్యకర్తల అభిప్రాయాలను అధిష్ఠానం దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. పాడేరు నియోజకవర్గంలో టీడీపీకి టికెట్ కేటాయిస్తే కచ్చితంగా విజయం సాధిస్తామని చెప్పామన్నారు. కార్యకర్తలు, నాయకులు యథావిధిగా క్షేత్ర స్థాయిలో పనిచేస్తూ టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేపూరి వెంగళయ్య, రీమల ఆనందరావు, ఆంద్రాబు లక్ష్మణ్, గబులంగి అప్పారావు, యూన్సీ లక్కోజు నాగ భూషణం, అడపా వీరబాబు, ముక్కలి రమేశ్ పాల్గొన్నారు.

వైద్య సేవలపై ప్రత్యేక బృందం ఆరా



లగిశపల్లి ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించిన ఎన్క్వాస్ బృందం

పాడేరు రూరల్, మార్చి 20: మండలంలోని మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని లగిశపల్లి ఆరోగ్య ఉప కేంద్రాన్ని బుధవారం ప్రత్యేక వైద్య బృందం సందర్శించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి షేక్ జమాల్ బాషాతో కలిసి బృందం వైద్యులు జనార్దన్ నాయక్, ఇంద్రదీప్ దాస్ పాల్గొని వైద్య సిబ్బంది ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అలాగే సబ్ సెంటర్ల ద్వారా అందిస్తున్న మాతాశిశు సంరక్షణ సేవల తీరుతెన్నులు, సబ్ సెంటర్ నిర్వాహణ, రికార్డులు, సబ్ సెంటర్ నిర్వహణకు అవసరమైన సామగ్రి, మరింత మెరుగ్గా వైద్య సేవలు ఏ విధంగా అందించగలం అనే అంశాలపై బృందం పరిశీలించింది. వైద్య సిబ్బంది వద్ద ఉన్న పూర్తి సమాచారాన్ని రికార్డులు ద్వారా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మినుములూరు పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ, వైద్య సిబ్బంది ఎస్పీ పడాల్, మాధవి, సరోజని, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నాటు తుపాకులు అప్పగించాల్సిందే..

... 5వ పేజీ తరువాయి

స్వచ్ఛందంగా అప్పగించిన ఆదివాసీలకు నగదు ప్రోత్సాహకాలను అందజేశామన్నారు. ఇప్పటికి ఆదివాసీల వద్ద నాటు తుపాకులు ఉంటే వెంటనే పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలన్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడం వల్ల ఉత్తరాది ప్రత్యేక పోలీసు బలగాలు గిరిజన గ్రామాలకు రానున్నాయని తెలిపారు. ఎన్నికల విధుల్లో ప్రత్యేక పోలీసు బలగాలు గ్రామాలు సందర్శించిన సమయంలో ఆదివాసీలు వేట కోసం తుపాకులను పట్టుకుని అడవుల్లోకి వెళితే మావోయిస్టులని అనుమానం పడే అవకాశం ఉందన్నారు. పోలీసు సోదాల్లో గిరిజనుల వద్ద నాటు తుపాకులు పట్టుబడితే కచ్చితంగా కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కేసుల్లో నిందితులకు పదేళ్ల వరకు జైలు శిక్ష పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ అరుణ్ కిరణ్ పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు అందరూ సహకరించాలి

- అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ శివకిశోర్

కొయ్యూరు, మార్చి 20: ప్రశాంత ఎన్నికలకు అందరూ సహకరించాలని చింతపల్లి అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ పిలుపునిచ్చారు. కొయ్యూరు, మంప పోలీసు స్టేషన్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న మంప పోలీస్ స్టేషన్ భవనాలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో గిరిజనులు నిర్భయంగా ఓటు వేయాలన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యువత రెండు మార్గాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి రవాణాదారులకు సహకరించడం వంటి కేసుల్లో ఇరుక్కుని జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. గిరిజన యువత అభ్యున్నతి కోసం ఉద్యోగ, ఉపాధి కల్పనకు పోలీస్ శాఖ ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నదని, వీటిని వినియోగించుకోవాలని ఆయన చెప్పారు. అనంతరం సిబ్బందికి ఎన్నికల విధులు నిర్వహణపై సూచనలు, సలహాలు ఇచ్చారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై డేగకన్ను వేసి ఉంచాలని సూచించారు. ముఖ్యంగా సంఘ విద్రోహక శక్తుల కార్యకలాపాలను పూర్తిగా నిరోధించేలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటరమణ, కొయ్యూరు, మంప ఎస్ఐలు రామకృష్ణ, లోకేష్‌కుమార్, అదనపు ఎస్ఐ దేముడు తదితరులు పాల్గొన్నారు.



మోదకొండమ్మ ఉత్సవ కమిటీ ప్రతినిధులు

మోదకొండమ్మ ఉత్సవ కమిటీ ఎన్నిక

పాడేరు రూరల్, మార్చి 20: గిరిజన ప్రాంత ప్రజల ఇలవేల్పు పాడేరు మోదకొండమ్మ ఉత్సవాల నిర్వహణకు బుధవారం కమిటీని ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలం నాయుడు తెలిపారు. అమ్మవారి ఉత్సవాలను మే 19, 20, 21వ తేదీలలో నిర్వహించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ ఉత్సవాలను నిర్వహణ కోసం కమిటీని అధ్యక్షుడిగా కొట్టగుల్లి రామారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. అలాగే ప్రధాన కార్యదర్శులుగా తమర్బ ప్రసాదరావు నాయుడు, యాదగిరి శ్రీను, కొమ్మోజు వెంకటరమణలను ఎన్నుకున్నట్టు ఆయన చెప్పారు. కమిటీ ఎన్నిక సమావేశంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మితో పాటు గ్రామ పెద్దలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నాయకులు, వర్తక సంఘ పెద్దలు, ఆధ్యాత్మిక సేవా బృంద సభ్యులు పాల్గొన్నారు.

వైద్యం చేస్తున్న మందుల షాపు సీజ్

- ప్రత్యేక తనిఖీల్లో గుర్తించిన అనకాపల్లి ప్రాంతీయ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రా భారతి



మెడికల్ షాపు తనిఖీ చేస్తున్న భారతి

దేవరాపల్లి, మార్చి 20: మెడికల్ షాపుల్లో శాంపిల్స్ మందులు, కాలం చెల్లిన మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని అనకాపల్లి ప్రాంతీయ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రా భారతి హెచ్చరించారు. బుధవారం ఆమె ఇక్కడ పలు మెడికల్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. స్టాక్‌తో పాటు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. వెంకటేశ్వర మందుల షాపులో వైద్యం చేస్తున్నట్టు తన తనిఖీలో వెల్లడైందన్నారు. దీంతో సదరు షాపు యజమానిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. షాపును తాత్కాలికంగా సీజ్ చేశామన్నారు. అనంతరం ఆమె షాపుల యజమానులతో మాట్లాడుతూ మందులు కొనుగోలు చేసిన వినియోగదారులకు విధిగా రశీదులు ఇవ్వాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించేవారిపై చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

జలాశయాలు వెలవెల

... 5వ పేజీ తరువాయి

ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. అలాగే జోలాపుట్టు జలాశయానికి దిగువ ప్రాంతంలో ఉన్న డుడుమ (డైవర్షన్) డ్యాంలో 2590 అడుగుల నీటిని నిల్వ ఉంచే సామర్థ్యం ఉండగా, ప్రస్తుతం 2576.35 అడుగుల నీటిమట్టం నమోదైంది. దీంతో జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పాదనకు అవసరమైన నీటిని డుడుమ జలాశయం నుంచి సరఫరా చేస్తున్నారు.

దిగజారిన విద్యుదుత్పత్తి

ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి తగ్గిపోయింది. మత్స్యగెడ్డ అడుగంటిపోవడం, జోలాపుట్టు, డుడుమ జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుముఖం పట్టడంతో జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి ఆశించిన స్థాయిలో జరగడం లేదు. మొత్తం ఆరు జనరేటర్ల సహాయంతో 120 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేసే సామర్థ్యం ఈ ప్రాజెక్టుకు ఉంది. అయితే ప్రస్తుతం రెండు జలాశయాల్లో నీరు ఆశించిన స్థాయిలో లేకపోవడం వల్ల ఒకటో నంబరు జనరేటర్ సహాయంతో కేవలం 17 మెగావాట్ల విద్యుదుత్పత్తి మాత్రమే చేస్తున్నారు. మిగిలిన ఐదు జనరేటర్లను నిలిపివేశారు.

ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలం

జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తికి నీటి సమస్య తలెత్తకుండా ప్రాజెక్టు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత పదేళ్ల వ్యవధిలో ప్రాజెక్టుకు ఇటువంటి నీటి సమస్య ఎప్పుడూ తలెత్తలేదు. దీంతో వారు నీటి సమస్య తలెత్తకుండా ఎటువంటి



జోలాపుట్టు జలాశయంలో నీటి నిల్వలు తగ్గిపోయిన దృశ్యం

ముందస్తు చర్యలు చేపట్టలేదు. దాని కారణంగానే ఈ ఏడాది ప్రాజెక్టుకు నీటి సమస్య తలెత్తిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా టర్నల్ పాయింట్(టీపీ)డ్యాం వద్ద అధిక శాతం నీరు నిత్యం వృధాగా పోతున్నది. అలాగే డుడుమ జలాశయానికి సంబంధించిన నీరు సరఫరా చేసే గేట్లు సక్రమంగా లేవు. వాచర్లు లేకపోవడం, గేట్లను పూర్తి స్థాయిలో దించకపోవడంతో అధిక శాతం నీరు నిత్యం వృథా అవుతోంది. జోలాపుట్టు, డుడుమ జలాశయాల్లో నిత్యం నీరు ఎక్కువగా ఉండడం వల్ల అధికారులు వృథా అవుతున్న నీటిని కట్టడి చేసేందుకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని తెలిసింది. ఈ ఏడాది వేసవి ప్రారంభంలోనే ఎండలు విజృంభిస్తుండడంతో ఈ రెండు జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుముఖం పట్టాయి. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురవకపోతే ప్రాజెక్టులో పూర్తి స్థాయిలో విద్యుదుత్పత్తి నిలిచిపోయే ప్రమాదం ఉంది.

సంక్షిప్తంగా..

టెన్త్ పరీక్షలకు 258 మంది విద్యార్థులు గైర్హాజరు

పాడేరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో టెన్త్ పరీక్షకు 258 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా బుధవారం ఇంగ్లీష్ పరీక్షకు మొత్తం 11,214 మంది హాజరుకావాల్సి ఉండగా 10,956 మంది మాత్రమే హాజరయ్యారని, 258 మంది గైర్హాజరయ్యారన్నారు. మొత్తం 11,214 మంది విద్యార్థుల్లో 11,112 మంది రెగ్యులర్, 102 మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉన్నారు. కానీ రెగ్యులర్ విద్యార్థులు 10,921 మంది, ప్రైవేటుగా 35 మంది హాజరయ్యారని, రెగ్యులర్ విద్యార్థులు 191 మంది, ప్రైవేటు విద్యార్థులు 67 మంది గైర్హాజరయ్యారన్నారు. జిల్లాలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదని, పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని డీఈవో పేర్కొన్నారు.

పాడేరు కేంద్రాల్లో ఐదుగురు..

పాడేరు రూరల్: మండల కేంద్రంలో మూడో రోజు జరిగిన పదో తరగతి పరీక్షలకు ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఐదు పరీక్షా కేంద్రాల్లో మండలంలోని 14 పాఠశాలలకు చెందిన 905 మంది విద్యార్థినీ, విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 900 మంది వచ్చారు. ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈవో-1 ఎస్.రామచందరరావు తెలిపారు. ఏపీఆర్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 200 మంది హాజరుకావాల్సి ఉండగా 199 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో 125 మందికి 124 మంది, తలారిసింగిలో 200 మందికి 200 మంది, శ్రీకృష్ణాపురంలో 196 మందికి 194 మంది, లోచలి పుట్టు కేంద్రంలో 184 మంది హాజరుకావాల్సి ఉండగా 183 మంది హాజరయ్యారని ఆయన చెప్పారు.

ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు

డుంబ్రిగుడ, మార్చి 20: మండలంలోని కించుమండ పంచాయతీ కేంద్రంలో అక్రమ కట్టడాలు జోరుగా సాగుతున్నాయి. 1/70 చట్టానికి విరుద్ధంగా పలువురు ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని అక్రమంగా దుకాణాలను నిర్మించుకుంటున్నారు. ఇటీవల జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డు పక్కనే ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని పలువురు దుకాణాలు నిర్మించుకుంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజనులు జీవనోపాధికి తాత్కాలికంగా షెడ్లు నిర్మించుకుంటేనే పంచాయతీ, రెవెన్యూ అధికారులు తొలగిస్తారని, అటువంటిది గిరిజనేతరులు ప్రభుత్వ భూముల్లో ఏకంగా దుకాణాలు నిర్మిస్తుంటే ఎందుకు స్పందించడం లేదని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. గిరిజన చట్టాలను ఉల్లంఘించి దుకాణాలు నిర్మిస్తున్న వారిపై చర్యలు తీసుకోవడంలో రెవెన్యూ, పంచాయతీ అధికారులు జాప్యం చేయడం సరికాదని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

ముంచంగిపుట్టులో మోస్తరు వర్షం



ముంచంగిపుట్టులో రహదారిపై నిలిచిన నీరు

ముంచంగిపుట్టు, మార్చి 20: మండల పరిధిలో బుధవారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణం మబ్బుగా ఉంది. చలిగాలులు వీచాయి. మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు దఫదఫాలుగా వర్షం పడింది. మండల కేంద్రం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే రహదారులు చిత్తడై పోయాయి. పలు చోట్ల రహదారులపై వర్షపు నీరు నిలిచిపోయింది. గుంతల్లో నీరు ఉండడంతో అటుగా రాకపోకలు సాగించే వాహన చోదకులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అకాల వర్షం మామిడి పూతకు ఎంతో మేలు చేకూరుస్తుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఇటువంటి వర్షాలు మరో రెండు మూడుసార్లు పడితే ఈ ఏడాది మామిడి దిగుబడి ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

హుకుంపేటలో...

హుకుంపేట: మండలంలోని బుధవారం ఉదయం వర్షం కురిసింది. దాదాపు 30 నిమిషాలు వరకు చిరుజల్లు పడడంతో మండల కేంద్రంలోని పదో తరగతి పరీక్షలకు హాజరుకావాల్సిన విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు పడ్డారు. తర్వాత వాతావరణం అనుకూలించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సైతం వాన హర్షం వ్యక్తం చేశారు.

ఎన్నికల ఫిర్యాదులపై ఫ్లయింగ్ స్క్వాడ్ స్పందించాలి

చింతపల్లి, మార్చి 20: ఎన్నికల నియమావళి ఫిర్యాదులపై ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు స్పందించాలని తహసీల్దార్ టి.రామకృష్ణ సూచించారు. బుధవారం రెవెన్యూ కార్యాలయంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఎన్నిల నియమావళి ఉల్లంఘణ ఫిర్యాదులు, ఓటర్లకు బెదిరింపులు, ప్రలోభాలు, సంఘ విద్రోహుల తరలింపు, మద్యం, ఆయుధాలు, మందుగుండు సామగ్రి తరలింపు తదితర ఫిర్యాదులపై వెంటనే స్పందించాలన్నారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే స్క్వాడ్ బృందాలు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే ఇబ్బందులు ఎదురవుతాయని హెచ్చరించారు. అలాగే ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు రిటర్నింగ్ అధికారికి సమాచారం ఇవ్వాలని ఆయన చెప్పారు.

రెండు బైక్‌లు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

ముంచంగిపుట్టు, మార్చి 20: మండలంలోని కుమడ పంచాయతీ దిగువ కుమడ గ్రామ సమీపంలో రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే... కుమడ పంచాయతీ బూరుగుమెట్ట గ్రామానికి చెందిన బి.అనిల్‌కుమార్ ఐస్‌లు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం అతను ఐస్‌లు విక్రయించేందుకు కుమడ వైపు తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా, అనకాపల్లి జిల్లా వి.మాడుగుల మండలానికి చెందిన ఒంప్రు దేముడు బైక్‌పై వేగంగా వస్తూ బలంగా ఢీకొట్టాడు. దీంతో అనిల్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు హుటాహుటిన ప్రైవేటు వాహనంలో స్థానిక సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. అతనికి వైద్యులు సంతోష్, గీతాంజలి వైద్య సేవలు అందించారు. బాధితుడు అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కె.రవీంద్ర తెలిపారు.